క్లుప్తంగా

రెంటచింతలలో జెడ్పీ పాఠశాలను ఏర్పాటు చేయండి

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినాను, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని బుధవారం గుంటూరు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కోరారు. రెంటచింతలలో జెడ్పీ పాఠశాల ఏర్పాటు చేయడం వలన ఎంతో మంది పేద విద్యార్థులకు మేలు జరుగుతుందని వివరించి ప్రతిపాదనలు ఇచ్చినట్లు వెల్లడించారు. గ్రామంలో సుమారు 20 వేల జనాభా ఉందని వారిలో ఎక్కువ మంది బడుగు బలహీన వర్గాలకు చెందిన వారని జెడ్పీ పాఠశాల ఏర్పాటు చేయడం వలన వారి పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలపడం జరిగిందన్నారు.

పోలేరమ్మ తిరునాళ్లలో కుంకుమబండ్లు

మంచికల్లు(రెంటచింతల): మండలంలోని మంచికల్లు గ్రామంలో నిర్వహిస్తున్న పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు గ్రామస్తులు కుంకుమబండ్లతో గ్రామోత్సవం నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం కుంకుమబండ్లు అందంగా ముస్తాబు చేసి గ్రామ పురవీధులలో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కుంకుమబండ్లు వెంట తెల్లవార్లు ఉత్సాహంగా, ఉల్లాసంగా చిందులు వేస్తూ సందడి చేశారు. ఎస్‌ఐ సామెల్ రాజీవ్‌కుమార్ గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యగా భారీ బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

31న పడిపూజ మహోత్సవం

దుర్గి: పల్నాడు ప్రాంతంలో ప్రసిద్ధి గాంచిన నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 31 ఆదివారం పడిపూజ, మండల దీక్ష విరమణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఈఓ గిరిరాజు నరసింహబాబు తెలిపారు. బుధవారం ఆలయంలోని కార్యాలయంలో మాట్లాడుతూ ప్రముఖ భజన బృంద గాయకుడు, దప్పు శ్రీనుచే భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పడిపూజ మహోత్సవం ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

డాల్ మిల్ అధ్యక్షుడిగా కొత్తమాసు బ్రహ్మారావు



మాచర్ల: డాల్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మాచర్ల పట్టణానికి చెందిన కొత్తమాసు బ్రహ్మారావును ఎంపిక చేశారు. పట్టణంలో డాల్ మిల్ నిర్వహిస్తున్న బ్రహ్మారావును మరోసారి అసోసియేషన్ అధ్యక్షులుగా బుధవారం ఎంపిక చేశారు. బ్రహ్మారావుతో పాటు గౌరవాధ్యక్షులుగా కపలవాయి వెంకటప్పయ్య, కొత్తూరి కాశీ విశ్వనాథం, సెక్రటరీగా చుండూరు పూర్ణచంద్రరావు, కోశాధికారిగా గుడిపాటి కోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ వేముల యేగయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా గోపవరపు శ్రీనివాసరావు, గోళ్ళ జనార్దనరావు, గుండా అప్పారావులను ఎంపిక చేసినట్లు కాశీ విశ్వనాథం తెలిపారు.

నేడు వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

మాచర్ల: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో స్వర్గీయ వంగవీటి రంగా విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్లు కృష్ణదేవరాయల కాపు సేవా సమితి అధ్యక్షుడు యరబోతుల శ్రీను, రామిశెట్టి వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. కాపుల కోసం ఎంతో కృషి చేసిన రంగా విగ్రహాన్ని పట్టణంలో గురువారం ఉదయం 10.30 గంటలకు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వంగవీటికి నివాళి

కారెంపూడి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో స్వర్గీయ వంగవీటి మోహనరంగా వర్ధంతిని అభిమానులు మంగళవారం రాత్రి నిర్వహించి వంగవీటికి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వైస్ ఎంపీపీ బొమ్మిన అల్లయ్యసావిత్రి, డాక్టర్ ఎం.సత్యనారాయణ, ఎస్.రాజారావు, బొమ్మిన హనుమయ్య తదితరులు పాల్గొని రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కాశీవిశ్వేశ్వరుడికి అన్నాభిషేకం



సత్తెనపల్లి: పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లో గల దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రీడలతో మానసిక వికాసం



శిరిగిరిపాడులో కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలు రెండవ రోజు కొనసాగుతున్నాయి. శిరిగిరిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటిన్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మండలంలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో క్రీడా పోటీలు కోలాహలంగా జరుగుతున్నాయి. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా ఆడుతున్నారు. అన్ని రకాల వయసుల వారు ఈ క్రీడల్లో పాల్గొంటున్నారు.

కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు

పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు రెండవ రోజు బుధవారం కొనసాగాయి. క్రికెట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండవ రోజు క్రీడలను ప్రారంభించిన పలువురు మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించేందుకే ప్రభుత్వం ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రెండవ రోజు ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా

మాచర్ల: పట్టణంలో రెండవ రోజు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో క్రీడోత్సవాలు సంబరంగా నిర్వహించారు. ఎంఈఓలు వేముల నాగయ్య, అల్లి సురేష్, కిడ్స్ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ శాస్త్రి, జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాల హెచ్‌ఎం రామారావు, పీఈటీలు సుభాష్‌రెడ్డి, రమేష్‌ల ఆధ్వర్యంలో పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రీడాకారులు ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొన్నారు. పోటాపోటీగా క్రీడా పోటీలు కొనసాగాయి. పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయంలో ముగిసిన అన్నదానం



అన్నదానం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పీఆర్కే



మండల పూజ నిర్వాహకులు

మాచర్ల: పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో గల అయ్యప్పస్వామి దేవాలయంలో కార్తీక మాసం నుంచి ప్రారంభమైన అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం కమిటీ సభ్యులు ముగించారు. దేవాలయ అధ్యక్షులు ఆత్మకూరి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. గురుస్వామి చిట్టేటి బాలయ్య, బత్తినపాటి శ్రీనివాసశర్మ, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 5వేల మందికి అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పోలా శ్రీనివాసరావు, చిల్లంచర్ల సత్యం, మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఆత్మకూరి సురేష్, వాసవి క్లబ్ మహిళా అధ్యక్షురాలు మేడా వెంకటలక్ష్మి, సెక్రటరీ పరిటాల ధనలక్ష్మి తదితరులున్నారు.

ముగిసిన మండల పూజా ఉత్సవాలు

పిడుగురాళ్ల రూరల్: మండలంలోని అయ్యప్పనగర్‌లో అయ్యప్పస్వామి దేవాలయంలో గత 41 రోజులుగా నిర్వహిస్తున్న మండల పూజ అత్యంత వైభవంగా మంగళవారం రాత్రితో ముగిసింది. స్వామి వారి సన్నిధానంలో సతీష్‌శర్మ ఆధ్వర్యంలో కలశాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు చేపట్టారు. మోర్జంపాడు నాగేశ్వరరావు బృందంచే నిర్వహించిన గాన కచేరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామివారి మండప అలంకరణ భక్తులను బాగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో వాసవి బిజినెస్ గ్రూపు వ్యవస్థాపకులు మడిపడిగె రాజు, వైశ్యరత్న పి.మల్లిఖారుజనరావు, ఆలయ ధర్మకర్త గుండా శ్రీనివాసరావు, కమిటీ అధ్యక్షుడు అంచూరి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి ఊటుకూరి సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

చినకొదమగుండ్లలో ఎంపీ పర్యటన

కారెంపూడి: మండలంలోని చినకొదమగుండ్ల గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం అమలు తీరును వికసిత్ భారత్ కేంద్ర ప్రభుత్వ పరిశీలకులు, రాజ్యసభ సభ్యులు అజిత్‌ప్రతాప్ సింగ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వికసిత్ భారత్ సంకల్ప ప్రచార వాహనంలో ఎంపీ గ్రామ పర్యటన చేశారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ 2024 క్యాలెండర్‌ను ఎంపీ ఆవిష్కరించారు. గ్రామంలో 9 మందికి వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరు పత్రాలను ఎంపీ పంపిణీ చేశారు. మండల కో ఆర్డినేటర్ కె.సుబ్బారావు మండలంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం కింద అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. మండలానికి 246 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరయ్యాయని ఎంపీకి వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెడ్డా కోటిరెడ్డి, డీఎల్‌డీవో గబ్రూనాయక్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, జేఈ వి.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి హైమావతి తదితరులు పాల్గొన్నారు.



మరుగుదొడ్డి మంజూరు పత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎంపీ అజిత్‌ప్రతాప్ సింగ్

దత్తు సేవలు మరువలేనివి

అన్నదానం.. నాణ్యత ప్రమాణాల అవగాహన సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కేసీపీ జీఎం వెంకట రమణ

మాచర్ల: భారతదేశంలో అత్యంత రాతి కట్టడమైన నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు దశాబ్దాల క్రితం సిమెంట్‌ను సప్లై చేసి సాగర్ నిర్మాణంలో పాత్ర పోషించిన డాక్టర్ దత్తు సేవలు మరువలేనివని కేసీపీ జీఎం వి.వెంకటరమణ అన్నారు. బుధవారం దత్తు 86వ జన్మదినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం, వివిధ దేవాలయాలలో పూజలు నిర్వహించారు. అనంతరం మీనాక్షి పీఎస్ఆర్ ఆంజనేయులు కంటి ఆసుపత్రిలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం కేసీపీ ఫ్యాక్టరీ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. అనంతరం ఆయన జన్మదినం సందర్భంగా ఫ్యాక్టరీ ఆవరణలో నాణ్యత దినోత్సవాన్ని నిర్వహించి జీఎం మాట్లాడుతూ కేసీపీ నాణ్యతకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ సందర్భంగా సంస్థలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బంది, ఉద్యోగులకు జీఎం వెంకట రమణ, డీజీఎం రామకోటేశ్వరరావు, సీనియర్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, హెచ్ఓడీ జి.శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావుతో పాటు పలువురు మాట్లాడి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకుడు శివయ్య, లక్ష్మీనారాయణ, కేసీపీ సంస్థ ప్రతినిధి కోటేశ్వరరావు తదితరులున్నారు.

గ్రేడ్-1 ఫార్మసిస్ట్ పద్మావతికి సూపర్‌వైజర్‌గా పదోన్నతి

ఘనంగా వీడ్కోలు



సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో గ్రేడ్-1 ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న పద్మావతికి ఫార్మసీ సూపర్‌వైజర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆమెను కందుకూరు బదిలీ చేశారు. ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న పద్మావతికి బుధవారం వైద్యశాల ప్రాంగణంలో వీడ్కోలు సభ నిర్వహించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ పద్మావతి ఎంతో పట్టుదలతో పనిచేసేవారని, అలాంటి వారికి పదోన్నతి లభించి వెళ్లటం ఆనందంగా ఉందన్నారు. మరోవైపు మంచి సోషల్ వర్కర్ వెళ్లటం బాధగా ఉందన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ఫార్మసీ విభాగంలో పద్మావతి ఎంతో నిబద్ధతతో పని చేశారన్నారు. ఫార్మసీకి సంబంధించి పేదవారికి చక్కగా సహాయపడ్డారని, అలాంటి వారి సేవలను పొందలేకపోవటం బాధగా ఉందన్నారు. ఫార్మసిస్ట్ పద్మావతి మాట్లాడుతూ సత్తెనపల్లి ఏరియా వైద్యశాల ఎంతో ప్రాముఖ్యత కలిగిన వైద్యశాలని, తాను ఎన్నో వైద్యశాలల్లో పని చేసినప్పటికీ ఇలాంటి మంచి వాతావరణం గల వైద్యశాలను ఎక్కడా చూడలేదన్నారు. అందులోను వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ లాంటి వ్యక్తి సహకారంతో వైద్యశాల దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ అందరం కుటుంబసభ్యులులాగా పని చేశామని, ఇలాంటి మంచి వైద్యశాల నుంచి వెళ్లటం బాధగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో శోభారాణి, గైనకాలజిస్ట్ డాక్టర్ సుష్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, మెడికల్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, వైద్యులు, స్టాఫ్ నర్సులు తదితరులున్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా ఉండాలి



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న ఆర్‌డీవో రమణకాంత్‌రెడ్డి

మాచవరం: గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు ఓటరు నమోదు కోసం వచ్చిన ప్రతి అర్జీని పారదర్శకంగా పరిశీలించి, తప్పిదాలు లేకుండా ఓటర్ల జాబితా ఉండేలా చూడాలని ఆర్‌డీవో రమణకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని పిన్నెల్లి గ్రామ సచివాలయం పరిధిలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులు తదితర అంశాలపై మాట్లాడారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని తెలియజేశారు. ఆయన వెంట స్థానిక రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



కారెంపూడి: మండలంలోని చినకొదమగుండ్ల గ్రామంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఓటర్లకు బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ జి.శ్రీనివాస్ 100 మంది ఓటర్ల సమక్షంలో ఓటు ఎలా వేయాలి వేసిన ఓటు వీవీప్యాట్ స్లిప్‌లో సరి చూసుకోవడం ఎలా అనే విషయాలను డెమో ద్వారా చేసి చూపించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని గ్రామాల్లో ఓటర్లకు అవగాహన కల్పించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రజలు ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలని అపోహలు వీడాలని అన్నారు. ఇదిలా ఉంటే అదే సమయంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామంలో అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించేందుకు వచ్చిన ఎంపీ అజిత్‌ప్రతాప్ సింగ్ ఈవీఎంలపై నిర్వహిస్తున్న డెమోను వీక్షించారు. గురజాల డీఎల్‌డీవో గబ్రూనాయక్, ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, సెక్టార్ అధికారి వెంకటేష్, సర్పంచ్ కోటిరెడ్డి, బూత్‌స్థాయి అధికారి, సచివాలయ సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

రేపు సీజ్ చేయబడిన వాహనాలకు వేలం

క్రోసూరు: పోలీస్ స్టేషన్ సిబ్బంది పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహులు బుధవారం తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు క్రోసూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్, మారుతి ఎస్టీడీ మోటార్‌కార్, పల్సర్ 150 డీటీఎస్ మోటార్ సైకిల్, ఆటో రిక్షా వాహనాలకు ఈ నెల 29న ఉదయం 11:00 గంటలకు బహిరంగ వేలం నిర్వహించబడుతుందని తెలిపారు. సదరు వాహనాల ధర రూ.2500, రూ.10,000, రూ.3,500, రూ.40,000గా నిర్ణయించడమైందన్నారు. సదరు పాట పాడిన ఖరీదుకు 12% జీఎస్టీ చెల్లించవలెనని తెలిపారు. ఆసక్తి గల పాటదారులు క్రోసూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో వాహనాలను ముందుగా పరిశీలించుకోవచ్చన్నారు.

ఈవీఎంలపై అపోహలు వద్దు



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఈవీఎంల పనితీరుపై అనుమానాలుంటే తొలగించుకోవాలని తహసీల్దార్ ఎం. భవానిశంకర్ చెప్పారు. మండలంలోని కుందురువారిపాలెం, గోళ్ళపాడు గ్రామాల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లకు ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎన్నికల సమయంలో వేసే ఓటు సక్రమంగా ఉందో లేదో వీవీప్యాట్‌లో కనిపిస్తుందన్నారు. మీరు వేసిన ఓటుకు సంబంధించి స్లిప్ వస్తుందన్నారు. ఓటర్ల అపోహలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, సర్పంచ్‌లు చయికం వెంకటప్పారెడ్డి, గోపు అప్పమ్మ, బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన దళితులు



టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

50 కుటుంబాలను ఆహ్వానించిన ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు చేస్తున్న బృహత్తర అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. మండలంలోని అడిగొప్పల గ్రామానికి చెందిన 50 దళిత కుటుంబాల వారు సర్పంచ్ నలబోతు చిన్నబ్బాయ్, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ హుస్సేన్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ దళితుల పట్ల ఎంతో అభిమానంతో ఉన్నారన్నారు. సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీలోనే దళితులకు లభించిందని పేర్కొన్నారు. రాజకీయ పదవులతో పాటు, నామినేటెడ్ పదవుల్లోనూ వారికి అవకాశం కల్పించారన్నారు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి అన్ని విధాలా సహకరిస్తానన్నారు. పార్టీలో చేరిన వారిలో మేకల కోటేశ్వరరావు, మేకల ఎలీషా, కొమ్ము ఏసయ్య, రాయపాటి పెదబ్రహ్మం, చంద్రబాబు, మేకల సంసోన్, కోటేశ్వరరావు, రాయపాటి వెంగియ్య, పొన్నూరి చిన వెంకయ్య, కొమ్ము యాకోబు, రాయపాటి కోటేశ్వరరావు తదితరులున్నారు. సచివాలయ కన్వీనర్ రాయల మధుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగుల్ మీరా, నలబోతు వెంకయ్య, డీలర్ మహేష్ పాల్గొన్నారు.

గ్రామస్తులు సుఖశాంతులతో జీవించాలి

వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులు పీవీఆర్



పోలేరమ్మ ఆలయంలో రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పీవీఆర్

మంచికల్లు(రెంటచింతల): మండలంలోని మంచికల్లు గ్రామంలో వేంచేసిన పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల వేడుకలను పురస్కరించుకుని బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ఆలయ ప్రధాన అర్చకులు వెంకటాచార్యులు నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఆర్ మాట్లాడుతూ చల్లని తల్లి పోలేరమ్మ అమ్మవారు గ్రామస్తులపై కరుణ, ప్రేమ, దయ చూపించి పైరుపంటలు సమృద్ధిగా పండాలని, సుఖశాంతులతో జీవించేలా దీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొట్లపాటి చంద్రారెడ్డి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ మోర్తల ఉమామహేశ్వరరెడ్డి, సొసైటీ అధ్యక్షులు పింగళ వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ నెవలి పద్మ సీతారామిరెడ్డి, నెవలి చిన్న నాగిరెడ్డి, యరపతినేని నరసింహారావు, పొట్లపాటి మల్లారెడ్డి, అరికట్ల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని విస్మరించారు

ప్రజావేదికలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

మాచవరం: పేదలకు పనిదినాలు కల్పిస్తూ, వారి జీవనోపాధిని మెరుగుపరచాలన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది విస్మరించారని, పేదలకు పనులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి బహిరంగ ప్రజావేదిక బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 01.04.2022 నుంచి 31.3.2023 వరకు జరిగిన రూ.4,61,44,981లకు గానూ 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 566 పనులు జరుగగా, వాటిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా 548, పంచాయతీరాజ్ శాఖ ద్వారా 16, ఆర్‌డబ్ల్యూస్ ద్వారా 1, ప్రహరీ నిర్మాణం 1 పనులు జరుగగా, రోజువారీ వేతన చెల్లింపులు ద్వారా రూ.3,59,02,448, మెటీరియల్ చెల్లింపులు రూ.1,02,42,533 జరిగినట్లు తెలిపారు. సంతకాలు లేకుండా మస్టర్లు, దిద్దుబాట్లు తదితర అంశాలకు సంబంధించి మొత్తం రూ.26,063, జరిమానా ద్వారా రూ.8000 రికవరీకి ఆదేశించారు. జాబ్ కార్డు కలిగిన పేద ప్రజలకు పనులు కల్పించాల్సి ఉన్నా, ఏ గ్రామంలోనూ ఎస్సీ, ఎస్టీలకు పనులు కల్పించలేదని, క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ల వైఫల్యాన్ని నిలదీశారు. ఈ ఏడాది ఎస్సీలకు నూరు రోజులు పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో పథకం ద్వారా సాగు చేస్తున్న ఉద్యాన పంట తైవాన్ జామపై సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది మండలంలో సుమారు 200 ఎకరాల్లో జామసాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ సురేంద్రబాబు, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీఓ వరప్రసాద్, ఎస్ఆర్పీ బుజ్జి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైస్ ఎంపీపీ నస్నేషిదా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, ఏపీఓ వెంకటేశ్వర్లు నాయక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

జిల్లా కలెక్టర్ శివశంకర్



ముప్పాళ్ళ జెడ్పీ పాఠశాల విద్యార్థినుల హెల్త్ కార్డులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

ముప్పాళ్ళ: విధుల పట్ల అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ హెచ్చరించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పరిశీలనలో భాగంగా బుధవారం ముప్పాళ్ళకు విచ్చేసిన ఆయన ఆటల పోటీల్లో పాల్గొంటున్న పలువురు విద్యార్థినులు నీరసంగా ఉండటాన్ని గమనించారు. వారిని పక్కనే ఉన్న గ్రామ సచివాలయానికి హెల్త్ కార్డులు తీసుకొని రావాల్సిందిగా ఆదేశించారు. హెల్త్ కార్డులతో వచ్చిన విద్యార్థినులకు బంగారుతల్లి కార్యక్రమంలో అందిస్తున్న వైద్యసేవలపైనా ఆరా తీశారు. హెల్త్ కార్డుల్లో పూర్తి స్థాయిలో వివరాలు నమోదు కాకపోవటాన్ని గమనించి హెచ్‌ఎంని వివరాలు ఎందుకు నమోదు చేయటం లేదని ప్రశ్నించారు. సంబంధిత తరగతి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రక్తహీనతతో బాధపడేవారికి ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని అందించాల్సిందేనన్నారు. విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా పనిచేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానన్నారు. సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి, తహసీల్దార్ భవానిశంకర్, ప్రధానోపాధ్యాయురాలు కుంభా నాగేంద్రమ్మ తదితరులున్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

సత్తెనపల్లి: ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లు విడుదలవుతున్న నేపథ్యంలో నిరుద్యోగులు, విద్యార్థుల సౌకర్యార్థం పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ శాఖా గ్రంథాలయానికి గ్రూప్స్ పుస్తకాలను గుంటూరు జాయింట్ కలెక్టర్ రాజకుమారి బుధవారం అందించినట్లు లైబ్రేరియన్ వాణి తెలిపారు. రూ.40,090 విలువ కలిగిన ఆరు పుస్తకాలను అందించినట్లు ఆమె తెలిపారు.